ARK MEDIA
SUBSCRIBE

TS 24 0026809

# నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం
ఎడిటర్ : కనుకుల అనంతరెడ్డి
జాతీయ తెలుగు దినపత్రిక
www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 147 | గురువారం, జూన్ 18, 2026 | పేజీలు : 02 | వెల రూ. 1.00/-

**విలేఖరులు కావలెను**

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...

**నియోజకవర్గ ఇంచార్జ్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను..**

సంప్ర : 94932 72754

# ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు

**ఆ భావన నుంచి అంతా బయటపడితే మంచిది**

**ఇక్కడే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం**

**సర్కార్ బడుల నుంచే ఐఎఎస్,ఐపిఎస్‌లు వచ్చారు**

**అందరికీ విద్య లక్ష్యంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు**

**కులమాతలకు అతీతంగా విద్య అందించాలన్న లక్ష్యం**

**ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్కూల్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి**



**రంగారెడ్డి,జూన్17(నేటి ప్రభాత దర్శిని):**

ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే ఆలోచన పోవాలని అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మైదానంలో సరదాగా విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూల్‌ను సర్కార్ నిర్మించింది. స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. ఆరుట్ల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా నిర్మించామని తెలిపారు. విద్యాశాఖపై ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు అపోహలు ఉన్నాయని.. అందరి అపోహలు తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ వేశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదన్నారు. విద్య ఖర్చు కాదని.. పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. విద్యతో సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని సీఎం విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టారన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువస్తే విమర్శలు చేశారని.. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామని తెలిపారు. మెస్సీ.. డ్రగ్స్ ముఠా లీడర్ కాదని, ఆర్థిక నేరగాడు కాదన్నారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే.. నెల రోజులకే చిరిగి పోయాయని విమర్శిస్తూ.. ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరం అన్నారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం. క్రీడాకారుల్లో స్ఫూర్తి

(మిగతా 2వ పేజీలో..)



## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**వరంగల్, నేటి ప్రభాత దర్శిని**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్‌ను పరామర్శించేందుకు ఆయన వరంగల్ జిల్లా హనుమకొండకు వెళ్లారు. పర్యటన అనంతరం తనకు సంపూర్ణ సహకారం అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొన్ని రోజుల క్రితం హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు తాను అరుదైన వ్యాధితో పోరాడుతున్నానని, తన అభిమాన నటుడు పవన్ కల్యాణ్‌ను ఒక్కసారి కలవాలనే కోరికను వ్యక్తం చేస్తూ ఒక దృశ్య సందేశాన్ని విడుదల చేశాడు. ఆ సందేశం పవన్ కల్యాణ్ దృష్టికి చేరడంతో వెంటనే స్పందించిన ఆయన, అభిమాని కోరిక తీర్చాలని నిర్ణయించారు. ఈ క్రమంలో నిరంజన్ నివాసానికి వెళ్లిన పవన్ కల్యాణ్ అతన్ని పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ నిరంజన్ చూపిస్తున్న ధైర్యం, ఆత్మవిశ్వాసం తనను కదిలించాయని తెలిపారు. "అరుదైన వ్యాధితో పోరాడుతున్న నిరంజన్ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శిస్తున్నాడు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న అతని మనోధైర్యం ఎంతో స్ఫూర్తిదాయకం. నిరంజన్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని శ్రీ వెంకటేశ్వర స్వామిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ అతనిపై ఉండాలని కోరుకుంటున్నాను" అని పవన్ పేర్కొన్నారు. తన వరంగల్, హనుమకొండ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి సహకరించిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పోలీసు శాఖ ఉన్నతాధికారులు నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే తెలంగాణ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వారి అభిమానాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని, అది తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తుందని చెప్పారు. చివరగా నిరంజన్‌ను ఉద్దేశించి, "నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో చూడాలని కోరుకుంటున్నాను" అంటూ పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు.

## తెలంగాణలో ఆగని వడగాల్పులు.. జూన్ 20 తర్వాతే రుతుపవనాల విస్తరణ

**తెలంగాణలో జూన్ 20 వరకు కొనసాగనున్న పొడి వాతావరణం**


**ఉత్తర, తూర్పు జిల్లాలకు మూడు రోజుల పాటు వడగాల్పుల హెచ్చరిక**

**సూర్యాపేట జిల్లా మోతేలో 43.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు**

**హైదరాబాద్, భద్రాచలం వరకు విస్తరించిన నైరుతి రుతుపవనాలు**

**రాష్ట్రంలో అక్కడక్కడా ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు**

**హైదరాబాద్, నేటి ప్రభాత దర్శిని**



తెలంగాణ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ, ఎండల తీవ్రత నుంచి ప్రజలకు ఇప్పుడిప్పుడే ఉపశమనం లభించే సూచనలు కనిపించడం లేదు. జూన్ 20వ తేదీ వరకు రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాల్లో పొడి వాతావరణమే నెలకొంటుందని, రానున్న మూడు రోజుల పాటు ఉత్తర, తూర్పు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా నివేదికల ఆధారంగా ఈ హెచ్చరికలు జారీ అయ్యాయి. బుధవారం ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు నమోదయ్యాయి. ఈ క్రమంలో జూన్ 17, 18, 19 తేదీల్లో ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించింది. గడిచిన 24 గంటల్లో సూర్యాపేట జిల్లా మోతేలో అత్యధికంగా 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఖమ్మం జిల్లా ఏడుపాలెంలో 43.5 డిగ్రీలు, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అటు హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు హైదరాబాద్, భద్రాచలం మీదుగా ప్రయాణిస్తున్నాయి. రానున్న 4–5 రోజుల్లో ఇవి రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించడానికి సానుకూల పరిస్థితులు ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే, ఉత్తర, మధ్య, తూర్పు జిల్లాల్లో రుతుపవనాలు పూర్తిస్థాయిలో విస్తరించడానికి జూన్ 20–21 వరకు సమయం పట్టవచ్చు. ఈ లోగా పలుచోట్ల సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. రాబోయే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని, ఆ తర్వాత 2–3 డిగ్రీల మేర తగ్గుముఖం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు.

## రాష్ట్ర రవాణా సంస్థ బస్సులో ప్రయాణించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**కరీంనగర్, జూన్ 17 (నేటి ప్రభాత దర్శిని):**

వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల నుంచి కరీంనగర్ ఎన్టీఆర్ విగ్రహం వరకు రాష్ట్ర రవాణా సంస్థ బస్సులో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రయాణించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, పాఠశాలలు, కళాశాలల సమయాలకు అనుగుణంగా అదనపు బస్సులు నడుపుతున్నామని తెలిపారు. మహాలక్ష్మి పథకం తర్వాత ప్రయాణికుల రద్దీ పెరగడంతో కొత్త బస్సులను కొనుగోలు చేసి కొత్త మార్గాల్లో నడుపుతున్నామని చెప్పారు. రాష్ట్ర రవాణా సంస్థలో గతంలో పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించామని, కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్మిక సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని, ఎన్నికలు పూర్తయ్యాక గెలిచిన సంఘ నాయకులతో విలీనం ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మాట్లాడాలని, వారికి అసౌకర్యం కలిగించవద్దని సిబ్బందికి సూచించారు. వేతన సవరణ ప్రకటించడం, గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించడం పట్ల డ్రైవర్లు, కండక్టర్లు సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు. విద్యార్థుల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని, గురుకుల పాఠశాలల్లో భోజన ఖర్చులు, ఇతర భత్యాలు పెంచినట్లు చెప్పారు. అనుభవం ఉన్న అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ఈ ఏడాది చిన్నారుల ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించి ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయపు అల్పాహారం, పాలు పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఒక్కో మహిళ నెలకు రెండు నుంచి మూడు వేల రూపాయల వరకు ఆదా చేసుకుంటోందని వెల్లడించారు. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ రాయితీ, సన్న బియ్యం, కొత్త రేషన్ కార్డులు, ఉద్యోగ నియామకాలు, రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తరువాత మాధ్యమాల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించిందని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర రవాణా సంస్థ దేశంలోనే అగ్రగామి ప్రజా రవాణా సంస్థగా నిలిచిందని, 10 వేలకుపైగా బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. జూన్ 21న జరగనున్న వైద్య ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పించే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు.

# పట్టణ పరిశుభ్రతపై అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి-అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

**గంజి కమాన్ వద్ద కల్వర్టు పని ఆలస్యంపై అధికారులపై అర్బన్ ఎమ్మెల్యే అసహనం**

**నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి నిజామాబాద్ జూన్ 18:**

నిజామాబాద్ నగర వాసులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం శానిటేషన్ పనులు కొనసాగించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు స్పష్టం చేశారు, బుధవారం రోజు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ నగరంలోని 34వ డివిజన్లో గల మిర్చి కంపౌండ్ మార్వాడి గల్లి ఓల్డ్ రమేష్ టాకీస్ రోడ్డు తదితర కాలనీలలో పర్యటించారు, ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ కేవలం స్పెషల్ డ్రైవ్ చేయబడుతున్నప్పుడు మాత్రమే కాకుండా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నిరంతరం ఆయా డివిజన్లో ఉన్న డ్రైనేజీ పరిశుభ్రత మంచినీటి సరఫరా వీధి దీపాల పనులను నిరంతరం పర్యవేక్షించాలని అర్బన్ ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు, మరియు అవసరమున్న చోట కల్వర్టుల నిర్మాణం కూడా చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ అధికారులకు సూచించారు అదేవిధంగా పలు వీధులలో మంచినీటి పైప్ లైన్ లీకేజీలు గమనించి వాటిని కూడా అరికట్టాలని అర్బన్ ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఇంకా ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ మాట్లాడుతూ ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా కూడా సంబంధిత అధికారులు వాటిపై వెంటనే స్పందించాలని అర్బన్ ఎమ్మెల్యే తెలిపారు అదేవిధంగా, నగర పరిశుభ్రతను ప్రతినిత్యం పర్యవేక్షణ చేస్తూ నగరాన్ని శుభ్రంగా ఉంచాలని అర్బన్ ఎమ్మెల్యే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు, ఈ సందర్భంగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ గంజ్ కమాన్ వద్ద ఉన్న కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించారు, గంజి కమాన్ వద్ద కల్వర్టు నిర్మాణ పనులు పూర్తయిన నేపథ్యంలో తదుపరి చర్యలను చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులకు సూచించారు, సంబంధిత కాంట్రాక్టర్ కల్వర్టు మాత్రమే నిర్మించి వెళ్లిపోయారని అర్బన్ ఎమ్మెల్యే



అసహనం వ్యక్తం చేశారు కల్వర్టు ఎత్తుగా నిర్మించినందున రోడ్డుకు సమాంతరంగా చేసే బాధ్యత ఆయా కాంట్రాక్టర్లది కాదా అని అర్బన్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే ధన్పాల్ ప్రశ్నించారు, వీలైనంత తొందరగా వాహన రాకపోకలకు సౌకర్యంగా ఉండేలా చూడాలని అర్బన్ ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు, ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ ఉమారాణి రమేష్ స్థానిక కార్పొరేటర్ బంటు ప్రీతి ప్రవీణ్ బిజెపి నాయకులు పవన్ ముందడ తదితర బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు

**మొదటి పేజీ తరువాయి..**

నింపేందుకు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే విమర్శలు చేశారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచాం. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన అంటున్నారు.. ఎలా సాధ్యమో చెప్పాలి. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం' అని సీఎం అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ విద్యా నమూనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 లక్షల మంది విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యాశాఖ కోసం రూ.8,500 కోట్లను కేటాయించిందని ఆయన వెల్లడించారు. విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఉద్యోగాలు రావన్న అపోహలు పేద ప్రజల్లో ఉన్నాయని, ఆ నమ్మకాన్ని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశామని సీఎం వివరించారు. విద్యా కమిషన్ వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలను సందర్శించి రూపొందించిన నివేదిక ఆధారంగానే ఈ కొత్త విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన 'దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది' అనే భావనను స్ఫూర్తిగా తీసుకుని విద్యా రంగంలో మార్పులు తీసుకొస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని, అందుకే విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని సీఎం తెలిపారు. భారీగా దరఖాస్తులు రావడంతో అడ్మిషన్లు లేవని బోర్డు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ విజయానికి అక్కడి ఉపాధ్యాయుల కృషే కారణమని, వారు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. తాను కూడా గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం గుర్తు చేసుకున్నారు. ఆరో తరగతి చదవడానికి రోజూ ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లేవాడినని చెప్పారు. తమ కుటుంబం ఆర్థికంగా బాగానే ఉన్నప్పటికీ చదువుకున్నవారు లేరని, 17 ఏళ్ల వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. దేశ ప్రధానులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు సహా ఎన్నో ప్రముఖులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని ఆయన పేర్కొన్నారు. సమాజంలో కులాల మధ్య గోడలు నిర్మిస్తున్నారని, ఆ గోడలను కూల్చాలనే ఉద్దేశంతో అన్ని వర్గాల పిల్లలు కలిసి చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. విద్య ద్వారా సమానత్వాన్ని పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశం ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేకపోతోందని అన్నారు. ఇటీవల దక్షిణ కొరియాను సందర్శించి అక్కడి క్రీడా విధానాలను అధ్యయనం చేశానని చెప్పారు. 2034 నాటికి తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించే క్రీడాకారులను తయారుచేయాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయ స్వార్థంతో కొందరు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ కిట్లు అందించేందుకు పారదర్శకంగా టెండర్లు నిర్వహించినప్పటికీ.. కొందరు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. ఉన్నత విద్యావంతులు కూడా వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. ఈ నెల 19న హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో గవర్నర్ సమక్షంలో డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పెద్దపల్లి జిల్లాలో యూరియా నిల్వలు పుష్కలం.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**రైతులకు ఎలాంటి కొరత లేకుండా పకడ్బందీగా ఎరువుల సరఫరా**

**రెండు మూడు రోజుల్లో యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం**

**పెద్దపల్లి, జూన్-17( నేటి ప్రభాత దర్శిని)**

ప్రస్తుత వానాకాలం-2026 సీజన్‌కు సంబంధించి పెద్దపల్లి జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటికి జిల్లాలో 18,750 మెట్రిక్ టన్నుల యూరియా, అ.వ 4,12,511 యూరియా బస్తాలు నిల్వలో ఉండి, యూరియా బుకింగ్ యాప్ ద్వారా పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి వారం రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)తో పాటు ఇతర కంపెనీల నుంచి యూరియా నిల్వలు జిల్లాకు చేరుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువుల సరఫరాపై వ్యవసాయ శాఖ పకడ్బందీ ప్రణాళికతో పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వల్ల పంటల విత్తనాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ప్రస్తుతం యూరియా బుకింగ్ యాప్‌ను తాత్కాలికంగా నిలిపివేశామని, మరో రెండు లేదా మూడు రోజుల్లో యాప్‌ను తిరిగి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. కావున పెద్దపల్లి జిల్లా రైతులు అందరూ యూరియా బస్తాల లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లి చే జారీ చేయనైనది.



# డి ఆర్ ఓ కు శుభాకాంక్షలు తెలిపిన తంగళ్ళపల్లి ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షులు



**సిరిసిల్ల, జూన్ 17 (నేటి ప్రభాత దర్శిని)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రెవెన్యూ అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన గొట్టె జయశ్రీని తంగళ్ళపల్లి ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షులు ఎడమల శ్రీధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు ఆయన వెంట క్లబ్ సభ్యులు మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు వైద్య శివప్రసాద్ లింగాల భూపతి సుద్దాల శ్రీనివాస్ లు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

# పానీపూరి తిని అస్వస్థతకు గురైన వారిని పరామర్శించిన డీఎంహెచ్‌వో





**తంగళ్లపల్లి, జూన్ 17 (నేటి ప్రభాత దర్శిని)**

బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (ఐవీఎూ) డా. ఏంజెలా అల్ఫ్రెడ్ గారు తంగళ్లపల్లి మండలంలోని కేసీఆర్ కాలనీలో పానీపూరి తిని అస్వస్థతకు గురైన 17 మంది పిల్లలు, 3 మంది పెద్దలను పరామర్శించారు. విరేచనాలు, వాంతులతో బాధపడుతున్న వీరు ప్రస్తుతం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, సిరిసిల్లలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వారి కుటుంబ సభ్యులు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. ప్రవీణ్‌తో డీఎంహెచ్‌వో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ముందురోజు పానీపూరి తినడం వల్లే ఈ అస్వస్థతకు గురైనట్లు గుర్తించామని, ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. అనంతరం కేసీఆర్ కాలనీ ప్రాంతాన్ని సందర్శించిన డా. ఏంజెలా అల్ఫ్రెడ్ రెండు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. ఎల్. నాగేందర్ బాబు, తంగళ్లపల్లి మెడికల్ ఆఫీసర్ డా. స్నేహ మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు కల సాకారం

**నేటి ప్రభాతదర్శిని తంగళ్లపల్లి జూన్ 17 :**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని చిన లింగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు లావణ్య ఆంజనేయులు, బుధవారం గృహప్రవేశం నిర్వహించగా ఇట్టి కార్యక్రమం కు ముఖ్య అతిథులుగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్ టోనీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నరసింగం గౌడ్ గారీ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి అనంతరం లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ కెకె మహేందర్ రెడ్డి పంపించిన చిరు కానుకను స్థానిక సర్పంచ్ శ్యాగ విజయ దేవేందర్ గారి చేతుల మీదుగా అందివ్వడం జరిగింది. లబ్ధిదారులు ప్రజా పాలన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి గారికి ,కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి కార్యక్రమం లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు నేరల నర్సింగ0 గౌడ్ ,మాజీ ఎంపీటీసీ బైరినేని రాము, వార్డు మెంబర్ పీట్ల.స్రవంతి,నాయకులు మునిగేల రాజు, గుగ్గిళ్ళ, శ్రీకాంత్ గౌడ్, పొన్నాల.పర్సారములు,మిరాల శ్రీనివాస్,శ్రీరామ్ గౌడ్,నారా గౌడ్,రవీంద్రారెడ్డి, సంగారెడ్డి,బాలరాజు తిరుపతి, ఎడ్ల తిరుపతి మరియు నాయకులు,మహిళలు పాల్గొన్నారు.

